౮౧

# మాకీ భర్త వద్దు

---

చుక్కలు వెన్నెల మడుగులో తమ నీడను చూచుకుంటున్నాయి.

సుధాంశుని కిరణాల జల్లులో తడుస్తూ ప్రకృతి పగలబడి నవ్వుతూంది. గాలి పిల్లలు ప్రకృతి చెక్కిలి మీటి పారిపోతున్నారు. కొండల్ని, లోయల్ని, టనెల్స్‌ని దాటుకుంటూ విసుగు లేకుండా పరుగెత్తుతూంది దక్షిణ ఎక్స్‌ప్రెస్. లయగా ఊగుతున్న రైలు కదలికల్లో జోగుతూ మైమరిచి నిద్ర పోతున్నారు టు టైర్ కంపార్ట్‌మెంట్‌లో వాళ్ళు. గతం తాలూకు జ్ఞాపకాల ఊయలలో ఊగుతూ మెలకువగా ఉండి మధ్య మధ్యలో క్షణానికో రీతిగా రూపు దిద్దుకుంటున్న ప్రకృతి కన్య అందాల్ని తిలకిస్తూంది సౌజన్య.

"ఎక్కడికి వెళుతున్నారు, దీదీ?" ముందు స్టేషన్‌లో ఎక్కినామె హిందీలో పలకరించింది సౌజన్యని.

"ఢిల్లీ."

"బంధువు లున్నారా అక్కడ?"

చాలా కాలం నుండి హైదరాబాదులో ఉండడం వల్ల సౌజన్య ఆవిడతో బాగానే మాట్లాడ గలుగుతూంది. కాని, ఆవిడతో సంభాషణ వల్ల తన కలల కంతరాయం కలగడం ఇష్టం లేదు. అందుకే గంభీరంగా, ముక్తసరిగా జవాబిచ్చింది.

"మా వారున్నారు."

"ఏం పని చేస్తున్నారు?" సౌజన్య అయిష్టాన్ని గమనించలే దామె.

"డాక్టరు."

"మేము చాల కాలంగా ఢిల్లీలోనే ఉంటున్నాము. మీరే ఏరియాలో ఉంటున్నారు? మీ వారే హాస్పిటల్లో పని చేస్తున్నారు?" ఉత్సాహంగా అడిగిందామె.

"క్షమించాలి. నేను ఢిల్లీకి రావడం ఇదే మొదటిసారి. మా వారు కరోల్‌బాగ్ ఏరియాలో ఉంటున్నారు. ఆయన ఆల్‌ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో పై చదువుకు వచ్చారు. థోరాసిక్ సర్జరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నారు. నేను పిల్లల చదువులు పాడయి పోతాయని హైదరాబాద్‌లోనే పిల్లల్ని పెట్టుకుని ఉండిపోయాను. ఇంకో ఆరు నెలల్లో మావారు హైదరాబాద్ వచ్చేస్తారు." తన కలల్ని, అయిష్టాన్ని పక్కకు పెట్టి ఆమెతో సంకోచం లేకుండా మాట్లాడసాగింది సౌజన్య. ఆవిడ అంత ఆప్యాయంగా మాట్లాడుతూంటే తను ముభావంగా ఉండడం సభ్యత కాదనిపించింది. అందంగా పూలు కుట్టిన తెల్లటి కాశ్మీర్ షాల్ తీసి కప్పుకుం దామె.

"అయితే, బహుశా....మీ శ్రీవారి మీది బెంగతో ఆయన్ని చూడ డానికి వస్తున్నా రనుకుంటాను." దాదాపు తన వయసే ఉన్న ఆమె అంత సన్నిహితంగా మాట్లాడుతూ హాస్యం చేస్తూంటే అందంగా సిగ్గు పడింది సౌజన్య. ఎర్రబడిన చెక్కిళ్ళు నీలి కాంతిలో వింతగా మెరి శాయి. జడ ముందుకు వేసుకుని, పయటచెంగు భుజాల చుట్టూ కప్పు కుని సీటు కానుకుంది, అరమోడ్పు కన్నులతో ఊహల ప్రవాహంలోకి జారుతూ మలిచిన శిల్పంలా కూర్చున్న సౌజన్యను చూచి 'ఎంత చక్కగా ఉందీ అమ్మాయి?' అనుకుందామె, మాట వరసకైనా తన గురించి అడగకుండా మందహాసాన్ని దాచుకోవడానికి వ్యర్థ ప్రయత్నంచేస్తున్న అధరాలపై చేతి నాన్చి కలలు కంటున్న సౌజన్యను చూసి నవ్వుకుందామె.

అవును. శ్రీవారి మీద బెంగ పుట్టే కదా తను హఠాత్తుగా బయలుదేరింది? పిల్లల్ని స్నేహితురాలి కప్పగించి, ఆయన్ని సర్‌ప్రైజ్ చేద్దామని వైర్ కూడా ఇవ్వకుండా, అప్పటి కప్పుడు విశ్వ ప్రయత్నం చేసి టూ టైర్ కంపార్ట్‌మెంట్‌లో బెర్త్ సంపాదించుకుని బయలుదేరింది. రేపు తనని చూడగానే ఆయన ముఖం చూసి తీరాలి, ఆశ్చర్యంతో, ఆనందంతో తనను రెండు చేతులతోను, పువ్వులా ఎత్తి, అబ్బ! సిగ్గు! బహు కొంటెవారు! ముద్దులతో తనను ముంచెత్తుతారు. తన దేహం ఆయన కౌగిలిలో కందిపోతుంది. కబుర్లతో కాలం తెలియదు. కబుర్లతో, చిలిపి చేష్టలతో రేపు రాత్రికి తనను నిద్ర పోనీయరు. ఎప్పుడైనా అమ్మ వాళ్ళింటికి వెళితే తన వెనకే పరుగెత్తుకు వచ్చేవారు. ఇన్నిన్ని రోజులు తనను చూడకుండా ఎలా ఉండ గలుగుతున్నారో! చదువు మీద ఆసక్తి, శస్త్ర శాస్త్రంలో ఇంకా ఇంకా అనుభవం గడించా లనే తపన తన మీది ప్రేమను జయిస్తున్నాయా? తనను కోరి వివాహం చేసుకుని, దాంపత్య జీవితం గురించి తను కన్న రంగుల కల లన్నిటినీ నిజం చేసిన ఆయన్ని పొందిన తనెంత అదృష్టవంతురాలు!

పదేళ్ళ క్రితం వివేకానంద హాల్లో జరిగిన బాపూ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో కలిసింది ఆయన్ని మొదటి సారి. అప్పటి కాయన నెవరో తనెవరో! యూనివర్సిటీలో స్పెషల్ బి. ఎస్‌సి. చదువుతున్న తను ముళ్ళపూడి వెంకటరమణ రచన లన్నా, బాపూ బొమ్మ లన్నా పడి చచ్చిపోయేది. అందుచేత సినిమాకని బయలుదేరిన స్నేహితురాళ్ళను తప్పించుకుని బాపూ బొమ్మలు చూడడానికి వివేకానంద హాల్‌కి వెళ్ళింది. ఒక్కొక్క బొమ్మ ముందు తీరికగా నిలబడి తన ఇష్టం వచ్చినంత సేపు చూస్తూ ఆనందిస్తూంది. "హలో బొమ్మగారూ!" ఉలిక్కి పడి వెనక్కి తిప్పింది తలను. అతని ఊపిరి తన చెంతకు తగిలేంత సన్నిహితంగా నిలబడి తన వంక చిలిపిగా చూస్తున్నా డతను. అతని ధైర్యానికి కోపం వచ్చి పెదాలు బిగించింది. అందమైన ఆడపిల్ల కనిపిస్తే 'బాపూ బొమ్మ.' షార్ట్ కట్ 'బొమ్మ' అని అందంగా ఏడిపించడం కాలేజి స్టూడెంట్స్‌కి హాబీగా ఉన్న రోజు లవి. అందుచేత ఆ పిలుపులో దాగి ఉన్న తన అందాన్ని గురించిన ప్రశంస తనకు కొంచెం ఆనందాన్నికూడా కలిగించింది.

"ఏమిటండీ, గోపాలంగారూ?" వెక్కిరింపుగా అడిగింది తను. చిత్రంగా కళ్ళార్పాడతను.

"సారీ; మీరు రాధగారా? బొమ్మగా రనుకున్నాను." ముళ్ళపూడి 'రాధా గోపాలం' ప్రసక్తి తెచ్చేసరికి తను తన కోపాన్ని మరిచిపోయింది.

"ఏమండీ, మీకు ముళ్ళపూడి రచన లంటే ఇష్టమా?"

"బోల్డు ఇష్టం." కళ్ళు పెద్దవి చేసి అతను చెబుతున్న తీరు చూస్తే నవ్వాగింది కాదు. నవ్వుకుంటూ, వ్యాఖ్యానాలు చేసుకుంటూ మిగిలిన చిత్రాలు చూసి సెలవు తీసుకుని ఎవరి దారిన వాళ్ళు వెళ్ళి

పోయారు. అతన్ని గుర్ించే ఆలోచిస్తూ, అతని జోక్స్ గుర్తుకు తెచ్చు కుని నవ్వుకుంటూ హాస్టల్‌కి వెళ్ళాక కాని అతను తన గురించి, తను అతని గురించి ఏమీ తెలుసుకో లేదని గుర్తించలేదు తను. అతని గురించి అస లెందుకు తెలుసుకోవాలి? అని మొండిగా అతన్ని మనసులో నుండి తొలగించడానికి ప్రయత్నించింది. కాని, అదంత సులభంగా కనిపించ లేదు.

పౌర్ణమి రోజున కెరటాల డోలికలో ఉగుతూ పైకి వచ్చే నిండు చంద్రుడి అందాల్ని ఒంటరిగా చూడడం అలవాటయింది వైజాగ్ వచ్చాక. తనెప్పుడూ కూర్చునే స్థలంలో కూర్చుని తన ముందు నురుగు లతో మెరుగుల నీనుతున్న అనంత జలరాశిని తన్మయంగా చూస్తూంది.

"హలో, రాధగారూ!" ఉలిక్కిపడి తన్మయావస్థ నుండి తేరు కుంది తను. అతను బాపూ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో చూచి నతను.

"ఓహో? గోపాలంగారా?" అంది తను వెంటనే. అతను చుట్టూ చూశాడు. అక్కడతను, తను తప్ప మరెవరూ లేరు.

"ఎవర్నండీ మీరు పిలుస్తూంట? గోపాల మనే ఫ్రెండ్‌కోసం చూస్తున్నారా మీరు?" అమాయికంగా ముఖం పెట్టాడు తను.

"అవునండీ. ఒక వారం రోజుల క్రితమే పరిచయ మవుత. కాని, మహా మొండివాడు లెండి. ఎంత నేను 'ఔట్, గెటవుట్' అని గొంతు చించుకున్నా' నా ఆలోచనల్లో నుంచి వెళ్ళిపోవడం లేదు." పెంకెగా అతని వంక చూసింది తను.

"రియల్లీ! అయితే, మీ రదృష్టవంతులే కొంతవరకు. కాని, నాకో గర్ల్‌ఫ్రెండ్ ఉంది లెండి. ఆవిడ పేరు రాధ. ఆవిడను గురించిన ఆలోచనలు నేను నుంచున్నా, కూర్చున్నా, మెలకువలో ఉన్నా, నిద్రలో

ఉన్నా నన్ను నిలవ నివ్వడం లేదు. నా మెదడులో, రక్తంలో, అణు వణువులో నిండిపోయి నాకు స్తిమితం లేకుండా చేస్తూంది. అఫ్‌కోర్స్ మీలా నేను ఔట్, గెటవుట్ అనడం లేదనుకోండి. "ఓ దేవీ! ఇలాగే కలకాలం నాలో నిలిచిపో' అని వేడుకుంటున్నా ననుకోండి." ఫక్కున నవ్వింది తను. తన పక్కన వచ్చి కూర్చున్నా డతను.

"గోపాలంగారూ!" తెరలు తెరలుగా నవ్వుతూనే పిలిచింది తను.

"ఏమిటండీ? మీ ఆలోచనల్లో నిలిచిన మొండివాడు రాదర్ అదృష్టవంతుడు వీడే నేమిటండీ?" గుండెమీద చూపుడువేలు నొక్కుకుని తన వంక తమాషాగా చూస్తున్న పేరు తెలియని అందగాడి చేతుల్లో తేనె ధార వంటి తన ప్రేమను పంచుతూందని అప్పుడు అనుకోలేదుతను.

తరవాత లెక్క తెలియని ఎన్నో అందమైన సాయంత్రాల్లో బీచ్‌లో, హాస్టల్ ముందున్న లాన్‌లో కూర్చుని గంటల తరబడి మాట్లా డుతూ ఒకరి మనస్తత్వాన్ని ఒకరు క్షుణ్ణంగా పరిశీలించారు. అతని ఆక ర్షణలో తను పూర్తిగా కూరుకు పోకముందే, అతని ప్రేమ వెల్లువలో తను పూర్తిగా తడిచి పోకముందే అతన్ని గురించిన పూర్తి వివరాలు సేకరించింది తను. ప్రదీప్ డాక్టరని, కె. జి. హెచ్. లో హౌస్‌సర్జన్సీ చేస్తున్నాడని వినగానే కొంత సేపు తటపటాయించింది తను. చదువులో వృత్తిలో ఎంతో మంది ఆడవాళ్ళతో సన్నిహితంగా ఉండవలసిన వ్యక్తి అతను. మనస్సు ముఖ్యంగా మగవాడి మనసు స్త్రీ పురుష సంబంధాల్లో కోతి లాంటిది. దాంపత్య జీవితం మీద, తన భర్త కావలసిన వ్యక్తిమీద కొన్ని స్థిరమైన అభిప్రాయా లున్నాయి తనకు. తన భర్త హృదయంలో, ఆలోచనల్లో, ఊపిరిలో తనే నిండిపోవాలి. కనీసం తన భర్త నీడమీద కూడా పరాయి ఆడదాని నీడ పడకూడదు. భర్త బయట ఎన్ని తిరుగుళ్ళు తిరిగినా అతని పాదాలు కడిగి సేవలు చేసే దౌర్భాగ్యపు బ్రతుకంటే

అసహ్యం తనకు. పరువు ప్రతిష్టల కోసం, పిల్లల కోసం చచ్చినట్టు మరో ఆడదానితో భర్తను వంచుకోవడమనే ఊహ తన హృదయాన్ని కాల్చేస్తుంది. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని నిశితంగా పరిశీలించిన మీదట సెక్స్ విషయంలో, పరాయి ఆడదాని విషయంలో వయస్సుతో, చనువుతో, హోదాతో సంబంధం లేకుండా మగవాడు చూపే చాపల్యాన్ని గమనించిన మీదట తను కోరుకుంటున్న అపర ప్రవరాఖ్యుడు దొరకడం చాలా కష్టమనుకుంది తను.

కానీ, ప్రదీప్ గురించి అతని ముఖతా విన్న విషయాలు, తను రహస్యంగా సేకరించిన విషయాలు జోడించిన మీదట తను కలలు కంటున్న వ్యక్తి అతను కాగల డనిపించింది. అయినా, అతను పెళ్ళి ప్రస్తావన తెచ్చినప్పుడు తన ఆలోచనల్ని, అభిప్రాయాల్ని, కలల్ని అతని ముందు పెట్టింది. తను చెప్పింది విని తనను సంకుచితురాలుగా, స్వార్థపరురాలుగా, ప్రపంచంలో ఉన్న సమస్య లన్నిటిలోను ఇదే భయంకరమైన సమస్యగా ఊహించు కుంటున్న విలక్షణ వ్యక్తిగా అత నెక్కడ భావిస్తాడోనని భయపడింది తను. తను భయపడ్డట్టుగానే అతను మొదలు పెట్టాడు.

"మీ చదువుకున్న ఆడపిల్లలకు ఆలోచన లెక్కువయిపోయి ఒక లాంటి ఎగో ఏర్పరచు కుంటున్నారు. ఏం? మీ కేనా ప్రేమ, పవిత్రత అనే పదార్థాల మీద అంతంత బ్రహ్మాండమైన అభిప్రాయా లుండేది? మగవాళ్ళంతా బలహీనులు, దుర్మార్గులు, సెంటిమెంట్స్ ఏమీ అంటని దున్నపోతులు, అందమైన ఆడది కంట పడగానే చొంగలు కార్చుకుంటూ దాని వెంట పడి స్వంత భార్యనీ, పిల్లల్నీ మరిచిపోయే రాక్షసులు మేము మాత్రం పతివ్రతా శిరోమణులం, ఏ బలహీనతలూ అంటని మనసున్న వాళ్ళం అని ఎందు కనుకుంటారో నా కర్థంకాదు." ఒక్క ఊపులో ఆవేశంగా అన్నాడు తను.

"కాని, మగవాడిని నిందిస్తున్న మీ ఆడపిల్లలు ఒక విషయాన్నెందుకు మరిచిపోతున్నారు? నేను వెంట పడుతున్నది మరో ఆడదాని వెనకే గదా? మీ ఆడవాళ్ళకి బుద్ధి, జ్ఞానం ఉంటే పవిత్రతమీద అంతంత గొప్పగొప్ప అభిప్రాయాలుంటే పరాయి మగవాడిని మీ వెంట ఎందుకు పడనిస్తున్నారు? ఒక్క పదిమంది ఆడవాళ్ళు వెకిలి వేషాలు వేసే పదిమంది మగవాళ్ళను పిచ్చి కుక్కల్ని తరిమినట్టు తరిమితే అది కనీసం కొన్ని వందల మంది మగవాళ్ళకు కనువిప్పు కలిగించదా? కాని మీరలా చెయ్యరు. మీ ఆడవాళ్ళంతా వట్టి స్వార్థపరులు. మరో ఆడదాని సౌభాగ్యాన్ని చూసి కుళ్ళి చచ్చిపోయే అసూయాపరులు. పలాని ఆడదాని ఇల్లు తగలడి పోతే ఆ బూడిదలో మీ ఇల్లు లేపుకోగల నికృష్టులు. మీలో యీ బలహీనతలున్నంత కాలం మీ జీవితాలు బాగుపడవు. మగవాడు మీ జీవితాలతో ఆడుకోక మానడు. మీ రంగుల కలలు నీటి బుడగల్లా పగిలి పోక మానవు." దిగ్భ్రమతో అతని వంకే చూస్తూంది తను. అతను తన ఆవేశాన్ని నిగ్రహించుకున్నాడు. తన వంక చూసి చిన్నగా నవ్వాడు.

"సారీ సౌజా: నువ్వు చెప్పిందంతా విన్నాక నన్ను నేను అదుపులో పెట్టుకో లేకపోయాను" అని తన చేతిని మృదువుగా అందుకున్నాడు.

"సౌజా! నీ మనసు విప్పి చెప్పినందుకు చాలా సంతోషంగా ఉంది. నీ హృదయాన్ని అర్థం చేసుకుంటున్నాను. అవసరం లేకపోయినా నువ్వు నిశ్చింతగా ఉండడానికి చెబుతున్నాను. జీవితం మీద, ముఖ్యంగా దాంపత్య జీవితం మీద నాకూ కొన్ని స్థిరమైన అభిప్రాయా లున్నాయి. ఈ క్షణంలో నిన్ను నా జీవితంలోకి రమ్మని ఆహ్వానిస్తున్నాను. ఈ క్షణం నుండి నా ఊపిరి ఆగిపోయే వరకు నువ్వే నా జీవితంలో, హృదయంలో నిలిచే స్త్రీవి. నువ్వు కోరుకుంటున్నట్లుగా పరాయి ఆడదాని నీడ కూడా నా

నీడ మీద పడదు." మృదువుగా,దృఢంగా మాట్లాడుతున్న అతని వంక ప్రేమగా చూసింది తను.

ఆనాటి నుంచీ ఈనాటి వరకూ ప్రదీప్ వంక ప్రేమ గానే చూస్తోంది తప్పితే ఏహ్యంగా చూసే పరిస్థితి కల్పించ లే దతను. తమ దాంపత్య జీవితం పండి ముగ్గురు పిల్లలు వికసించారు. అతని సాంగత్యంలో గడిచిన పదేళ్ళు పది క్షణాల్లా దొర్లిపోయాయి. ప్రతి చర్యని, ప్రతి సంఘటనని శల్య పరీక్ష చేసి, మంచీ చెడూ రెండు వైపులా చూసి తర్కించే తను చాలా కాలం తరవాత కాని అతన్ని పూర్తిగా విశ్వసించ లేదు. ఇప్పు డింక ఆ దేవుడే దిగి వచ్చి ప్రదీప్ గురించి చెడుగా చెప్పినా నమ్మలేని స్థితిలో ఉంది.

ఇంకెంత! కొన్ని గంటల్లో ఆయన ముందుంటుంది. ఆయన అమృత హస్తాల్లో సేద దీర్చుకుంటుంది తను. ఆయన మాటల్లో మధుర సంగీతం వింటుంది తను. ఆయన స్పర్శ లోని స్వర్గాన్ని అనుభవిస్తుంది తను.

* * *

అడ్రస్ ప్రకారం ఆ ఫ్లాట్ అవునో,కాదో చూసి కాలింగ్ బెల్ నొక్కిన సౌజన్య ఉద్విగ్నతతో కళ్ళు విప్పార్చుకుని తలుపు వంక చూస్తోంది. ఒక నిమిషం తరవాత తలుపు తెరుచుకుంది. రెప్ప వెయ్యడం మరిచిపోయి ఆ స్త్రీ మూర్తి వంక చూసింది సౌజన్య. ఎత్తుగా,ఆరోగ్యంగా, గులాబీ రంగు ఒంటితో, తీర్చి దిద్దిన కను ముక్కు తీరుతో ఆడవాళ్ళని కూడా ఆకర్షించే అందంతో ఉందామె. ఒక క్షణం పోయాక తెప్పరిల్లిన సౌజన్య ప్రదీప్ ఇల్లు మారాడేమో ననుకుంది.

"లోపలకు రండి." వీణ మీటినట్లుగా ఉందామె స్వరం. స్వచ్ఛమైన హిందీ మాట్లాడుతూం దామె. మంత్రముగ్ధలా లోపలకు నడిచింది సౌజన్య.

"మీరు...." సందిగ్ధంగా చూసిం దామె.

"డాక్టర్ ప్రదీప్ గారుండే దిక్కడేనా?" ప్రదీప్ పేరు వినగానే ఆమె రోజా రంగు చెక్కిళ్ళు ఎరుపు రంగుకు తిరిగాయి. అవునన్నట్లుగా తల ఊపిం దామె.

"కూర్చోండి." సోఫా చూపించిం దామె. ఇంటి మనిషిలా మర్యాదలు చెయ్యడం, ప్రదీప్ పేరు వినగానే ఆమెలో వచ్చిన మార్పుని సౌజన్య ఆశ్చర్యంగా గమనిస్తూంది.

"ఆయన ఇంట్లో లేరా?" ఆవేశం తెరలు తెరలుగా పొంగి వస్తూంది. తన ఇంట్లో తన భర్త కాకుండా మరో స్త్రీ దర్శన మివ్వడం నిగ్రహించుకోడానికి ప్రయత్నిస్తూ గదిలో కలియ జూసింది సౌజన్య. టేబిల్ మీద మంచి గంధపు ఫోటో స్టాండులో ప్రదీప్ ఫోటో ఉంది ప్రదీప్ ఫోటో చూడగానే అతను ఇల్లు మారలేదని ధ్రువ పరుచుకుంది.

"క్షమించాలి మీరు నిలబడే ఉన్నారు. మీరు మా వారి బంధువులా?" ఎంతో సౌమ్యంగా అడిగిం దామె. ఆమె ప్రశ్న విని చివ్వున తల ఎత్తింది సౌజన్య. ఆమె కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

"ఆయన మీ వారా?" ప్రదీప్ ఫోటో వైపు చూపించి అడిగింది సౌజన్య. సౌజన్య ఎందు కంత ఆవేశ పడుతూందో తెలియని ఆమె సౌజన్య వంక చిత్రంగా చూస్తూంది.

"అవును. మా వారే. మా పెళ్ళయి నాలుగు నెల లయింది. కూర్చోండి. ఆయ నిప్పుడే వచ్చేస్తారు. చండీఘర్‌లో కాన్ఫరెన్స్ ఏదో ఉంటే వెళ్ళారు. ఈపాటికి ప్లేన్ వచ్చేసే ఉంటుంది. బహుశా టాక్సీలో ఆయన సగం దూరం వచ్చేసే ఉంటారు."వాస్తవాన్ని మనసుకు పట్టించుకోవడానికి ప్రయత్నిస్తూంది సౌజన్య. ఇంతలో ఆమె టీ తీసుకు వచ్చింది. టీ చప్పరిస్తూ ఆలోచిస్తూంది సౌజన్య.

"మీరు మద్రాసే అనిపిస్తోంది. ఏ ఊరి నుంచి వచ్చారు మీరు? మా వారు మీ కేమవుతారు?" లలిత లలితంగా ఉన్న ఆమె స్వరంలో ఎదటి వారిని కట్టేసే శక్తి ఉంది.

"హైదరాబాదు నుంచి వచ్చాను." సంతోషంగా మధ్యలోనే ఆపిం దామె.

"అయితే, మీరు మా వారి కజిన్ అనుకుంటాను. మీ గురించి ఆయన ఎప్పుడూ చెబుతూ ఉంటారు." సన్నటి సెగ లేస్తోంది సౌజన్య హృదయంలో.

"మా పెళ్ళి చాలా సడెన్‌గా జరిగింది. లేకపోతే బహుశా మిమ్మల్ని పిలిచి ఉండేవాళ్ళం." మౌనంగా వింటూంది సౌజన్య. తను తొందర పడకూడదు. ప్రదీప్ వచ్చాక అసలు విషయం తేల్చుకోవాలి.

"మీ కజిన్ చాలా మంచివారు. మే మిద్దరం ఒకే డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాం. మా పరిచయ మయి దాదాపు రెండేళ్ళు కావస్తున్నా, ఒక్క ఆరు నెలల క్రిందటే పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చాం. దాదాపు పెళ్ళి వయసు దాటిపోయి వృత్తికే అంకితమయి పోవాలనుకుంటున్న నా బ్రతుకులోకి మీ కజిన్ అకస్మాత్తుగా వచ్చి నాలో నిద్రాణంగా ఉన్న కోరికల్ని తట్టి లేపారు. నాకూ భర్త, పిల్లలు, సంసారం కావాలనే కోరిక బలపడింది. అందుకే మీ కజిన్‌ని అపురూపంగా నా జీవితంలోకి ఆహ్వా నించాను. అలాంటి భర్తను పొందిన నే నెంతో అదృష్టవంతురాల్నని మురిసి పోతున్నాను." అమాయికంగా మనసు విప్పి మాట్లాడుతున్న ఆమె వంక శక్తి లేనట్లుగా చూసింది సౌజన్య.

"సారీ! మీరు చాలా అలిసి పోయినట్లున్నారు. స్నానం చేసి విశ్రాంతి తీసుకుందురు గాని. బాత్రూమ్ చూపిస్తాను రండి."

బాత్రూమ్‌లోకి వెళ్ళి తలుపు వేసుకున్న సౌజన్య నిస్త్రాణగా తలుపు నానుకుని నిలుచుండిపోయింది. తనంటేనూ, పిల్ల లంటేనూ ప్రాణం పెట్టే ప్రదీప్ మరో స్త్రీని పెళ్ళాడడమా! తన మనసుకు గాని, శరీరానికి గాని లేశమంత కష్టం కలిగినా విలవిల లాడిపోయే వ్యక్తి ఇంత దారుణానికి ఒడిగట్టి ఉంటాడని నమ్మలేక పోతూంది. కణతలు పగిలి పోతున్నాయి. ఆలోచించడానికి కూడా ఓపిక లేనట్లుగా ఉంది. షవర్ తిప్పి స్నానం చేసేప్పటికి కొంత అశాంతి తగ్గి ఆలోచించడానికి శక్తి వచ్చినట్లుగా ఉంది. టవల్ తీసుకుంటూ బయటి శబ్దా న్నాలకించింది. టాక్సీ ఆగిన శబ్దం, బూట్ల చప్పుడు 'అమ్రితా' అని పిలుస్తున్న ప్రదీప్ గొంతు, అమ్రిత పద ధ్వని వినిపించాయి.

"అబ్బ! ఏమిటా చిలిపితనం! ఇంట్లో చుట్టా లున్నారు." ఇంగ్లీషులో చిన్నగా అంటూంది అమ్రిత. జరుగుతున్నది ఊహించుకుంటూంది. సౌజన్య.. ఆమె హృదయం మండి పోతూంది. పిడికిళ్ళు బిగుసుకుంటు న్నాయి, రక్తం పొంగుతూంది. పెదా లదురుతున్నాయి. యాంత్రికంగా డ్రెస్ చేసుకుంటూంది.

"మనింటికి చుట్టాలా? ఎవరబ్బా! నీ తరఫున బంధువు లనే వాళ్ళే లేరు. నా తరఫున ఇప్పుడిక్కడికి వచ్చేంత తీరి కెవరికీ లేదు."

"చూడండి, మనింటికి వచ్చిన చుట్టా లెవరో!" మధురంగా నవ్వుతున్న అమ్రిత, అతని కతి సన్నిహితంగా కూర్చున్నదల్లా తలుపు చప్పుడు విని చటుక్కున లేచింది.

"నువ్వా?!" సర్పాన్ని చూసినట్లు గబుక్కున లేచాడు ప్రదీప్.

"నేనే"— తాపీగా వచ్చి అతని ఎదురుగా సోఫాలో కూర్చుంది.

"కొంచెం అల్పాహారం తయారు చేస్తాను. మీరు మాట్లాడుతూ ఉండండి." ప్రదీప్‌కి టీ కప్పు అందించి లోపలకు వెళ్ళింది అమ్రిత.

"ఇంత సడెన్‌గా వచ్చావేమిటీ?" కఠినంగా ఉంది అతని ముఖం.

"సడెన్‌గా రాబట్టే మూసుకుపోయిన నా కళ్ళు తెరుచుకున్నాయి! సడెన్‌గా వచ్చాను కాబట్టే నా స్థానంలోకి వచ్చిన మరో స్త్రీని ఇంత త్వరగా చూడగలిగాను." సాధ్యమైనంత మృదువుగా మాట్లాడడానికి ప్రయత్నిస్తోంది సౌజన్య.

"నువ్వు అపోహపడుతున్నావు సౌజన్యా! ఆమె నా కొలీగ్. నాకు కేవలం స్నేహితురాలు." అదుర్దాగా సౌజన్య వంక చూశాడు ప్రదీప్. సౌజన్య ఇంత అకస్మాత్తుగా రావడంతో అతని మెదడు పని చెయ్యడం లేదు. ఏం మాట్లాడుతున్నాడో అతనికే తెలియడం లేదు.

"తప్పు చెయ్యడంకన్నా, దాన్ని కప్పిపుచ్చుకోవడానికి చేసే ప్రయత్నం చాలా నీచంగా ఉంటుంది. మీ మాటల్ని అమాయకంగా నమ్మేయడానికి మీ మీది ప్రేమతో, నమ్మకంతో మీకు దూరంగా హైదరాబాదులో ఉండి పిల్లల్ని పెంచుతున్న సౌజన్యకాదు మీ ముందుంది. చెప్పండి. ఎందుకు చేశా రిలా? మీరు లేని క్షణాల్ని యుగాల్లా దొర్లిస్తున్న నా కెందు కింత ద్రోహం చేశారు? కంఠం గద్గద మవకుండా ఉండడానికి విశ్వ ప్రయత్నం చేస్తూంది సౌజన్య.

"సౌజన్యా:" వారించ బోయాడు ప్రదీప్.

"మీ ఊపిరి ఆగిపోయే వరకు మీ నీడనుకూడా మరో స్త్రీ నీడ తాకదని భరోసా ఇచ్చారే నాకు! నేను తప్పితే మరో స్త్రీ మీ హృదయంలో ఉండద న్నారే? ప్రేమ మీద, దాంపత్య జీవితం మీద, పవిత్రత మీద మీకూ ఉన్నతమైన అభిప్రాయా లున్నాయని చెప్పి నాకా నమ్మకాన్ని కలిగించారే? అవన్నీ మరచిపోయి మరో స్త్రీని నా స్థానంలో నిలుపు

తారా?" కన్నీళ్ళు జారకుండా ఉండడానికి ప్రయత్నిస్తూంది సౌజన్య. ప్రాణం లేనట్టుగా ఉందామె ముఖం.

"నన్ను క్షమించు సౌజన్యా! పరిస్థితు లలా వచ్చాయి. ఆవిడ అందంతో, వైద్యంలో ఆమెకున్న ప్రతిభతో నన్ను ఆకర్షించాలని ప్రయత్నించింది.ఏదో భయంకరమైన చాపల్యం నే నామెకు వశమయ్యేలా చేసింది."

"స్టాపిట్"- బిగ్గరగా అరిచింది సౌజన్య.

"వంచనకు కూడా హద్దుండాలి. మీ చాకచక్యంతో నన్నూ, ఆవిడను కూడా భ్రమలో ఉంచాలని చూడకండి! యదార్థం ఎంత చేదుగా ఉన్నా ఎదుర్కోక తప్పదు." ఒక క్షణం ఆగి తనను తాను సంభాళించుకుంది సౌజన్య.

"ఆవిడను కూడా పిలవండి. నే నెవరో ఆమెకు చెప్పండి. మా ఇద్దర్నీ మీ రే గంగలో కలప దలచుకున్నారో మాకు చెప్పండి." బ్రెడ్ టోస్ట్ చేసి తెచ్చింది అమ్రిత. సౌజన్యకు, ప్రదీప్‌కి చెరో ప్లేటు అందించి సౌజన్య ప్రక్కన కూర్చుంది అమ్రిత.

"చెప్పండి ఆవిడతో." కరుకుగా పలికింది సౌజన్య.

"సౌజన్యా! బయటకు వెళ్ళి మాట్లాడుకుందాం పద." సౌజన్య రెక్క పుచ్చుకుని బయటకు లాక్కు వెళ్ళబోయాడు ప్రదీప్. ఒక్క విదిలింపుతో రెక్కను విడిపించుకుని కఠినంగా అతని వంక చూసింది సౌజన్య. వాళ్లిద్దరూ ఎందు కంత ఉద్రేక పడుతున్నారో తెలియని అమ్రిత విస్మయంగా వాళ్ళ వంక చూస్తూంది.

"మనం మాట్లాడుకునే దేదో ఇప్పుడే, ఇక్కడే మాట్లాడుకుందాం. కూర్చోండి. చెప్పండి మీ ప్లాన్ ఏమిటో!"

తలవంచుకుని కూర్చున్నాడు ప్రదీప్.

"నన్ను హైదరాబాదులో, ఈవిడను ఇక్కడ ఉంచి ఇద్దరు భార్యల ముద్దుల భర్త అయి రెండు కాపురాల్నీ మానేజ్ చేద్దా మనుకుంటు న్నారా? లేక....నా కలల్నీ, కోరికల్నీ మీతో పెనవేసుకున్నందుకు శిక్షగా నన్ను వదుల్చుకోవా లనుకుంటున్నారా?" ఆవేశంగా అడిగింది సౌజన్య.

"ఏమిటి, మీ రింత అసభ్యంగా అరుస్తున్నారు?" తెలుగు అర్థమవని అమిత సౌజన్య వంక చిరాగ్గా చూసింది. అమిత మాట విని రోషంతో కంది పోయింది సౌజన్య ముఖం.

"నా కాపురంలో మరో స్త్రీ నిప్పులు పోస్తుంటే నేను సభ్యతగా ఎలా మాట్లాడగలను? నా భర్తను పట్టుకుని మరో ఆడది 'నా భర్త' అంటూంటే సౌమ్యంగా ఎలా ప్రవర్తించగలనమ్మా?"

కొరడా దెబ్బ తిన్నట్లు చూసింది అమిత.

"ఏమిటి మీ రనేది?"

"అవునమ్మా! 'మా వారు,' 'మా వారు' అని ఇందాక మురుస్తూ చెప్పావే, ఆయనగారు తాళి కట్టిన భార్యను నేను" చురుగ్గా అమితవంక చూసింది సౌజన్య.

"నో. ఇంపాజిబుల్. అలా కావడానికి వీల్లేదు." అసహనంగా అరిచింది అమిత.

"సభ్యత, అసభ్యతల మధ్యనున్న అంతరం ఎంత సున్నితమో చూశావా, అమితా? నువ్వు కావడానికి వీల్లేదని ఎంత గట్టిగా అరిచినా చెరిగిపోని నిజమిది. ఆయన ముఖం చూసయినా ఇది నిజమనే నమ్మకం నీకు కలగడం లేదా?" శిలలా నిలుచుండి పోయింది అమిత. ఆ అమ్మాయి ముఖం చూసి జాలి వేసింది సౌజన్యకు.

"అమ్రితా! ఇందాకా ఏదో కోపంలో మిమ్మల్ని నా కాపురంలో నిప్పులు పోస్తున్నారని నిందించాను. కాని, మిమ్మల్ని చూస్తూంటే, మా వారు.... సారీ! మనవారు చెప్పినట్లుగా సాటి ఆడదాని కొంప తగలడి పోతే ఆ బూడిదలో మీ ఇల్లు లేపుకోగల సామర్థ్యమున్న దానిలా లేరు. బహుశా నా గురించి మీ కసలు తెలిసే ఉండదు."

చైతన్యం లేనట్లు నిలుచున్న అమ్రిత నోరు విప్పింది, "అవును. మీ గురించి నాకు తెలియదు. తెలిసి తెలిసి సాటి ఆడదాని బ్రతుకును నాశనం చేసేంత దుర్మార్గురాలిని కాను."

"నాకు తెలుసు మీరంత ఘాతకపు పని చెయ్యలేరని, జరిగిందానికి బాధ్యు లెవరో మన ముగ్గురికీ స్పష్టంగా తెలుసు. కాని, ఇప్పుడు ఆలో చించవలసింది జరిగిపోయిన దానిని గురించి కాదు. జరగవలసిన దాన్ని గురించి చెప్పండి. మా ఇద్దర్నీ ఏం చెయ్యదల్చుకున్నారు, మీరు?"

సౌజన్యతో పాటు అమ్రితకూడా ప్రదీప్ వంక చూసింది. కత్తుల్లాంటి వాళ్ళ చూపులు తన శరీరాన్ని తూట్లు తూట్లు చేస్తున్నట్లని పించింది ప్రదీప్‌కి. ఒక్క నిముషం ఆలోచిస్తూ ఉండిపోయాడు ప్రదీప్. కాంతివిహీనమైన కళ్ళతో అతని వంక చూస్తూంది అమ్రిత. 'హాస్పిటల్, రోగులు, ఆపరేషన్లు తప్పితే మరో ప్రపంచం ఎరుగని నన్ను నిర్దాక్షిణ్యంగా ఇంత ఊబిలోనికి ఎందుకు దించావు? ఆలస్యంగా బ్రతుకులో స్థిరపడ్డా, మంచి తోడును పొందానని ఎంత పిచ్చిదానిలా పొంగిపోయాను! నీ మంచితనం వెనుక ఇంత మోసం, నీ ప్రేమ వెనుక ఇంత కపట నాటకం ఉందని ముందే తెలిస్తే ఎంత బాగుండేది. ఈ ఆశాభంగాన్ని ఎలా భరించేది? గరళం లాంటి ఈ నిజాన్ని ఎలా మింగేది?' అని అడుగు తున్నట్లున్నా యామె చూపులు.

"ఇంత వరకు వచ్చాక, ఇంక నా మనసులో ఉన్నది స్పష్టంగా చెబుతాను. సౌజన్యా! నువ్వు, అమ్రిత అమిత సంస్కారులు. నన్ను

ప్రాణసమంగా ప్రేమిస్తున్నారని తెలుసు. నాకు మీ రిద్దరూ చెరో కన్ను. అందులో ఏ కన్ను కన్నీరు కార్చినా సహించలేను నేను."

అంతవరకు నిగ్రహంగా ఉన్న సౌజన్య మరి ఆగలేక పోయింది. "ఆపండి. కన్నబిడ్డలు చెరో కన్ను అవగలరేమో కాని, కట్టుకున్న భార్యలు అలా అవలేరు. ఒక స్త్రీ మీద ప్రేమ చచ్చిపోతే తప్ప మరో స్త్రీని భార్యలా ప్రేమించలేరు. నేను, నా బిడ్డలు మీ దృష్టిలో చచ్చి పోయినట్లే లెక్క. అందుకే అమితను పెళ్ళాడగలిగారు మీరు.

"అలా అనకు సౌజన్యా!" వారించ బోయాడు ప్రదీప్.

"మరెలా అనను?నా మీద ప్రేమ చచ్చిపోక పోతే మీరు అమితను ప్రేమించలేరు. పెళ్ళితో తప్పితే వశంకాని స్త్రీ కాబట్టి ఈ అందాల రాశిని ప్రేమ పెళ్ళి అనే అందమైన బురఖాలతో నేర్పుగా వంచించి ఉండాలి. అవునా?" సౌజన్య వంక సూటిగా చూడలేక పోయాడు ప్రదీప్.

"చూడండి. మిమ్మల్ని నమ్మి నేను ఒక విధంగా, అమిత మరో విధంగా మోసపోయాము. దయచేసి మమ్మల్నింకా మోసగించాలని ప్రయత్నించకండి. మీతో పెనవేసుకున్న మా బ్రతుకుల గురించి స్పష్టంగా చెప్పే ధైర్యం మీకు లేకపోయినా, నా బ్రతుకు గురించి నా నిర్ణయం వినండి." తమ మధ్య జరుగుతున్న సంభాషణ అమితకు అర్థంకావాలని ప్రయత్నపూర్వకంగా ఇంగ్లీషులో మాట్లాడుతూంది. సౌజన్య, రెప్ప వాల్చకుండా సౌజన్య వంక చూస్తూంది అమిత.

"మన పెళ్ళికి ముందు మీరు చేసిన వాగ్దానాల్ని మరచిపోయి నా స్థానాన్ని మరో స్త్రీతో పంచుకోమంటున్నారు మీరు. అమిత చాలా ఉత్తమురాలు, సంస్కారవంతురాలు. కాని, ఆమె ఎలాంటిదయినా మరో స్త్రీతో స్థానాన్ని పంచుకోవడానికి నేను సిద్ధంగా లేను. నేను మీ జీవితం నుంచి తప్పుకో దలుచు కున్నాను." పక్కలో బాంబు పేలినట్లయింది ప్రదీప్‌కి.

"సౌజన్యా! నువ్వు ఆవేశపడుతున్నావు."

"ఇది ఆవేశం కాదండీ. భరించలేని ఆవేదన. తను నమ్మిన మగవాడే ఒడుపుగా చురకత్తిని గుండెల్లో దిగేస్తుంటే నిస్సహాయంగా చేసే ఆక్రందన."

"గోరంతను కొండంత చేస్తున్నావు సౌజన్యా! ఆ మాత్రం సర్దుకు పోలేవా?"

ఎర్రబడిన కళ్ళతో వాడిగా చూసింది సౌజన్య. "సర్దుకు పోవడమా?! ఇది సర్దుకుపోయే విషయమేనా? మీరిలా ఒక ఆడదాని తరువాత మరో ఆడదాన్ని పెళ్ళాడుతూ ఉండండి. సవతు లందరం కలిసి సర్దుకు పోతూ సహజీవన సౌభాగ్యాన్ని స్థాపిస్తాం. సరేనా?.... అది సరే.... నేను మీలా చేస్తే మీరు సర్దుకు పోగలరా? మరో మగవాడితో కలిసి నా ప్రేమను, నా దేహాన్ని పంచుకో గలరా? చెప్పండి! మీరలా చేయలేరు. నాకు తెలుసు....చూడండి. తరతరాలుగా మే మిలా సర్దుకుపోయే మీ కిలా కాళ్ళు తెచ్చాము. సంసారం చట్టబండ లవుతుందని, తనూ, తన బిడ్డలూ అనాధులుగా వీధిలో నిలబడవలసి వస్తుందని, పరువు ప్రతిష్ఠలు మంటగలసి పోతాయని, ఆర్థికంగా మీ మీద ఆధారపడ్డ ఆడది మీ బెదిరింపులకు హడలిపోయి, విధిలేక, మరో దారిలేక సర్దుకొని పోతూంది. ఎలాగూ సర్దుకు పోతారన్న ధీమాతో, ఎందుకు సర్దుకు పోలేరన్న అతిశయంతో, చచ్చినట్లు సర్దుకు పోవాలన్న శాసనంతో మీరుధైర్యంగా, విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు." కసిగా చూసింది సౌజన్య.

"ఇంక మేము సర్దుకుపోయే ప్రసక్తి లేదు. మీ రెంత దౌర్భాగ్యపు పనులు చేస్తున్నా మీతో కలిసి బ్రతుకుతూ ఆ హైన్యాన్ని భరించలేము. మమ్మల్ని మీతో కట్టి ఉంచేవి ప్రేమ, మమత. సాటి మనిషిగా మా కిస్తున్న విలువ తప్పితే అధికారం, వంచనా కాదు. ఆడవాళ్ళుగా

పుట్టిన నేరానికి మీ కాళ్ళ దగ్గర బానిస బ్రతుకు బ్రతుకుతూ అనుక్షణం చస్తూ బ్రతకము." ఆవేశంతో వణుకుతూంది సౌజన్య.

"ఉపన్యాసా లివ్వడంలో నీకు చాలా ప్రజ్ఞ ఉందని తెలుసు. కాని, ఇది వేదిక కాదు. సంసారం."

ప్రదీప్ వంక కాల్చేసేలా చూసింది సౌజన్య.

"నా కాపురం, నా కలలు నా కళ్ళ ముందే భస్మమయి పోతూంటే కడుపు మండి భరించలేక నేను మాట్లాడుతూంటే నాది ఉపన్యాసమని హేళన చేస్తున్నారా ? మాటల్నీ, జీవితాన్నీ ఇంత తేలికగా ఎలా తీసుకో గలుగుతున్నారు మీరు ? అవును. ఇది సంసారమే. అదీ నా సంసార విషయమే. అందుకే అంత తేలికగా తీసుకోలేక పోతున్నాను. బాగా ఆలోచించే మీ నుండి విడిపోవడానికి నిర్ణయించుకున్నాను."

"ఇందాకటి నుండి చూస్తున్నాను. విడిపోతాను విడిపోతానని చిందులేస్తున్నావు ! పిల్లలేన్నం చేస్తావు? ఎలా పెంచుతావు ?" ఏ మాత్రం సంకోచం లేకుండా అతనిలా ఎగతాళిగా మాట్లాడుతూంటే భరించలేక పోతూంది సౌజన్య. భర్తను వదిలి వేసిన భార్యగా, తండ్రి రక్షణలేని పిల్లలతో తన భవిష్యత్తు ఎలా ఉంటుందో, తను ఒంటరిగా పిల్లల్ని ప్రయోజకుల్ని చెయ్యడం ఎంత కష్టతరమో ఊహించ గలదు సౌజన్య. కాని, ధైర్యాన్ని కూడదీసుకుంది.

"మీరు బాధ్యతారహితంగా ప్రవర్తించారని నేనూ అలా ప్రవర్తించను నా జీవితంలో ప్రేమ, పెళ్ళి అనే అధ్యాయం మంచు తెరలా జారి పోయింది. ఇంక నా సర్వశక్తులూ ధారపోసి నా పిల్లల్ని పెంచుతాను. నా కొడుకుల్ని వంచకులు దగాకోర్లు కాకుండా చేస్తాను. నా కొడుకుల్ని డబ్బుకు అమ్ముడు పోని వ్యక్తులుగా, తమతో సమానంగా పుట్టిన ఆడపిల్లల్ని గౌరవంగా చూడగల మనుషులుగా తయారుచేస్తాను." ఉద్విగ్నతతో చలించి పోతూంది సౌజన్య.

"కాని.... తమ తండ్రి తన చదువును, సంస్కారాన్ని మరిచి, క్షణికమైన చాపల్యానికి లొంగిపోయి, తమ తల్లిని దారుణంగా వంచించేంత అల్పవ్యక్తి అని నా బిడ్డలకు తెలిసి, వాళ్ళు సిగ్గుతో తలలు వంచుకుంటూంటే నేనెలా చూడగలగేది? 'వీళ్ళ తండ్రి ఎంతమంది పెళ్ళాలయినా భరించి, పోషించగల సరసుడు' అని పదిమందీ నా బిడ్డల్ని హేళన చేస్తూంటే ఆత్మన్యూనతతో కుంగిపోతూన్న వాళ్ళ ముఖాల్ని నేనెలా చూసేది?!" ఈ తెల్లాంటి ఆమె మాటలు ప్రదీప్‌ని చిత్రహింస పెడుతున్నాయి. విస్మయంగా చూస్తూంది అమ్రిత.

"మిమ్మల్ని కోర్టుకు లాగి మీ మీద కక్ష తీర్చుకోగల అవకాశముంది నాకు. అయినా....గౌరవంగా సంఘంలో ఒక హోదాతో బ్రతుకుతున్న అమ్రిత బ్రతుకు కూడా మనిద్దరి బ్రతుకులతోను ముడిపడి ఉండడంవల్ల ఆమెనుకూడా రచ్చకీడ్చే సాహసం చెయ్యలేక పోతున్నాను. అదీకాక మీ నుంచి నేను కోరేది భార్య అనే గౌరవ స్థానమే కాదు. నా హృదయాన్ని పులకరింప చేసే మీ ప్రేమకూడా కావాలి నాకు. చట్టం నా కది ప్రసాదించలేదు." సౌజన్య కంఠం క్రమేపీ గద్గదమయింది. కనుకొలకుల్లో నిలిచిన రెండు మంచి ముత్యాల్ని కొనగోటితో కిందికి రాల్చింది.

"నా జీవితం గురించి నాకు నచ్చిన నిర్ణయం నేను తీసుకున్నాను. అంతకుమించి జోక్యం చేసుకోడానికి నా కధికారంలేదు. అయినా, చదువు, సభ్యత, అందం కలబోసిన ఈ స్త్రీమూర్తినిచూశాక నా మనస్సొప్పడంలేదు. దయచేసి మీ మనస్సు మార్చుకోండి. అమ్రిత మనసు కష్టపెట్టకండి. స్త్రీ ప్రేమ, జీవితం, కన్నీళ్ళు చాలా విలువైనవి. వాటిని తేలికగా తీసుకోకండి." ప్రాధేయపూర్వకంగా ప్రదీప్ వంక చూసింది సౌజన్య. అప్పటి వరకు ప్రేక్షకురాలులా చూస్తూ కూర్చున్న అమ్రిత చటుక్కున సౌజన్య చేతు లందుకుని రోజా మొగ్గల్లా ఉన్న తన పెదవుల కానించుకుంది.

"దీదీ! ఎంత మంచి మనసు మీది." పట్టేసిన కంఠాన్ని సవరించు కుంది అమ్రిత.

"మరో స్త్రీతో భర్తను పంచుకోలేక అతన్నుండి దూరంగా వెళ్ళి పోతున్నారు మీరు. కాని, ఒక మోసగాడితో జీవితాన్ని పంచుకునే ధైర్యం లేదే నాకు. దీదీ! నేను ఒంటరిగా బ్రతకడానికి అలవాటు పడ్డాను. ఎవరో ఒకరు తోడుగా ఉంటే జీవిత మెంత మధురంగా ఉంటుందో తెలిపారు డాక్టర్ ప్రదీప్! నా కడుపులో పెరుగుతున్న డాక్టర్‌గారి ప్రతి బింబం ఇక ముందు నాకు తోడుగా ఉండి ఆ మాధుర్యాన్ని నా కంది స్తాడు. దీదీ! నాకు త్వరలోనే ఫారిన్ ఛాన్స్ వస్తుంది. మీ జీవితాల్లో నా నీడ పడనంత దూరంగా వెళ్ళిపోతాను. నా వల్ల మీ సంసారం పాడవు తూందంటే నా గుండె పగిలిపోతూంది, దీదీ!"

"అమ్రితా! నా జీవితంలో నీ నీడ పడనంత మాత్రాన సమస్య పరిష్కార మవదు. అసలు బుద్ధి అనేది మంచిగా ఉండాలి కాని, ఒక అమ్రిత పోతే, మరో సవిత, మరో కవిత. అందుచేత నా నిర్ణయానికి తిరుగు లేదు. ఇలా విడిపోయి, దూరంగా వెళితే సమస్య పరిష్కారమవు తుందా అంటే 'బహుశా అవచ్చు, అనే ఆశ ఉంది నాకు. ఆ పరిష్కారం లభించేలోపు వందమంది సౌజన్యలూ, మరో వందమంది అమ్రితలూ తమ జీవిత మాధుర్యాన్ని బలిచెయ్యవలసి రావచ్చు. అమ్రితా! ఒకసారి ఈయనే చెప్పారు. పదిమంది ఆడవాళ్ళు వెకిలి చేష్టలు చేసే పదిమంది మగవాళ్ళని పిచ్చికుక్కల్ని తరిమినట్లు తరిమితే వందమంది మగవాళ్ళ కది కనువిప్పవుతుందని. ఆయన మాటలు నిజమేననిపించాయి. పదిమంది మగవాళ్ళ మోసాన్నిలా ప్రతిఘటిస్తే వందమంది మగవాళ్ళ కది కనువిప్పు కలిగిస్తుందేమో! వేచి ఉండాలి." దృఢంగా ఉందామె స్వరం. బొట్టు పెట్టుకుని తన సూట్‌కేస్ తీసుకుంది సౌజన్య. సూట్‌కేస్ పట్టుకున్న సౌజన్య చేతిని పట్టి ఆపింది అమ్రిత.

దీదీ! నన్ను క్షమించి మీరు వెళ్ళకండి. తెలిసి చేసినా, తెలియక చేసినా మీ కాపురాన్ని కూలదోసింది నేను. దయచేసి యీ వ్యధ నన్ను జీవితాంతం వెంటాడేలా చెయ్యకండి." దీనంగా చూసింది అమ్రిత.

"అమ్రితా! ఇందులో నీ తప్పేమీ లేదు. నువ్వనవసరంగా బాధ పడకు. నీ మంచితనం, సంస్కారం నిన్నలా భావించేలా చేస్తున్నాయి. తప్పితే యథార్థంగా నువ్వు నిమిత్తమాత్రురాలివి. ప్లీజ్. అమ్రితా! నన్ను వెళ్ళనివ్వు." మృదువుగా ఆమె చేతిని విడిపించుకుంది సౌజన్య. చేష్ట లుడిగిన వాడిలా చూస్తూ కూర్చున్నాడు ప్రదీప్. సౌజన్య గుమ్మం దాటుతుండగా ఒక్క అంగలో వెళ్ళి ఆమె భుజాన్ని పట్టి ఆపాడు.

"నీ కింత మొండితనం పనికిరాదు. నువ్వు వెళ్ళొద్దు." అతని స్వరంలోని అధికారాన్ని గమనించి తిరస్కారంగా అతనివంక చూసింది సౌజన్య. ఇంత జరిగినా తనది మొండితన మని నిందిస్తున్నాడు తప్పితే, అతనిది తప్పని ఒప్పుకోవడం లేదు. ఎంత అహంకారం!

"దయచేసి ఇంక వాదన పెంచకండి. నా దారిన నన్ను పోనీయండి. నన్ను ఆపగలిగే అర్హతను మీ రెప్పుడో పోగొట్టుకున్నారు." అతన్ని విడిపించుకుని బయటికి వచ్చింది సౌజన్య.

టాక్సీ వచ్చేలోపు నడిచిన పది గజాలు పది మైళ్ళలా అనిపించాయి. టాక్సీ డోర్ తెరచి దానిలోకి ఎక్కడానికి సర్వశక్తులూ కూడ దీసుకోవలసి వచ్చింది నిస్సత్తువగా సీటు మీద వ్రాలిన సౌజన్య, తన వెనకే అమ్రితకూడా ప్రదీప్‌ని తన ఫ్లాట్ నుండి వెళ్ళగొట్టి శాశ్వతంగా అతని జీవితాన్నుంచి తప్పుకుందని ఊహించలేదు.

స్టేషన్ వైపు చర్రున దూసుకు పోతూంది టాక్సీ. టాక్సీ వేగాన్నీ, బయట పరుగులిడుతున్న జనప్రవాహాన్నీ గమనిస్తూ, చైతన్యాన్ని పుంజుకుంటూ, భవిష్యత్తు మీద అపారమైన ఆశల్ని పెంచుకుంటూ నిటారుగా కూర్చుంది సౌజన్య. ●